అభివృద్ధికి నిలువుటద్దంలా నగరం

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- రూ. 3కోట్లతో నందివెలుగు రోడ్డు బీటీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, ఎమ్మెల్సీ ఏసురత్నం, కమిషనర్ కీర్తి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: నగరం అభివృద్ధికి నిలువుటద్దంలా మారిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి నందివెలుగు రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు 800 మీటర్ల బీటీ రోడ్డును నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) నిధులు రూ. 3కోట్లు అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు సోమవారం ఎమ్మెల్యే ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర కమిషనర్ కీర్తి చేకూరి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ 2019 నుంచి రాష్ట్రానికి మహార్దశ పట్టిందని తెలిపారు. గత ప్రభుత్వాలు అభివృద్ధి ఆటకెక్కించిన పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి లక్ష్యంగా పరిపాలన కొనసాగించారని చెప్పారు. ముఖ్యంగా గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. నందివెలుగు రోడ్డు పునరుద్ధరణ ద్వారా ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ నందివెలుగు రోడ్డు పునరుద్ధరణ ద్వారా ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభిస్తోందన్నారు. రోడ్డు విస్తరణ పనుల జాప్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రూ.3 కోట్ల అంచనాలతో నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇప్పటికే అన్ని డివిజన్‌లలో ప్రాధాన్యత క్రమంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.
- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, కులమత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాటుపడుతున్నారని పేర్కొన్నారు.
- నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరంలో వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎన్‌క్యాప్ నిధులతో రోడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పటికే నందివెలుగు రోడ్డు విస్తరణ పనుల్లో జీఎంసీ నుంచి ఎంతో కాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని, నూతన బీటీ రోడ్డును త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపించిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైతం ఆయన్ను

నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం: మేయర్

నెహ్రూనగర్: నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆర్.అగ్రహారం ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా రెండో విడత కింద రామనామక్షేత్రం నుంచి శ్రీనివాసరావుపేట శ్మశానవాటిక వరకు రూ.1.65 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆర్.అగ్రహారం ప్రధాన రహదారి అభివృద్ధితో ఐదు వార్డుల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మొదటి విడతగా ఇప్పటికే వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి రామనామ క్షేత్రం వరకు రోడ్డు, డ్రెయిన్లు, సెంటర్ డివైడర్, లైటింగ్ వంటి అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, కంతేటి శ్యామ్ శేఖర్, ఖాజా మొహిద్దీన్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ ఆచారి, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్, స్థానిక కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి, మెహమూద్, ఇర్రి ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బుర్ర కథకు జీవం పోసిన నాజర్



లక్ష్మీపురం: బుర్రకథకు షేక్ నాజర్ జీవం పోశారని ప్రజా నాట్య మండలి జాతీయ కార్యదర్శి గని అన్నారు. అరండల్‌పేటలోని ఆవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం పాడుదాం రండి, బృంద సభ్యుల ఆధ్వర్యంలో షేక్ నాజర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గని మాట్లాడుతూ ప్రాచీన జానపద కళా రూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది విస్తృత ప్రచారం కల్పించిన బుర్ర కథ పితామహుడు నాజర్ అని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ ఆటపాటల ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజ పరిచిన మహనీయుడు షేక్ నాజర్ అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


మహిళపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: ప్రేమిస్తున్నానని చెప్పి మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నెహ్రూనగర్‌కు చెందిన నాగరాజు అదే ప్రాంతానికి చెందిన మహిళతో రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం నడిపి లైంగిక దాడి చేశాడు. ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. బాధిత మహిళ పెళ్లి చేసుకోమని కోరగా, నిరాకరించాడు. సోమవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జారిపడి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టల్ కాలనీలోని నివాసం ఉండే గన్నెపాటి ప్రసాద్ (56) రెండు రోజుల కిందట బాత్‌రూములో జారిపడి గాయపడ్డాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కర్రసాములో స్టైమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: బీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 13వ రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్టైమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ ఫాదర్ థామ్ రెడ్డి తెలిపారు. విద్యానగర్‌లోని స్టైమ్ స్కూల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థులు బి. అక్షిత్, కె. కార్తికేయ, డి. గని, ఎస్. అనిరుధ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయిని జయశీల, ఉపాధ్యాయులు రమాదేవి, మౌనిక పాల్గొన్నారు.

రెవరెండ్ బెంజిమిన్ కృపానిధికి ఘన నివాళి



పాత గుంటూరు: నగరంపాలెంలోని సెయింట్ జాన్స్ సీఎస్ఐ చర్చి ఆవరణలో దైవజనులు రెవరెండ్ బూసి బెంజిమిన్ కృపానిధి (ప్రథమ జ్ఞాపకార్థ స్తుతి కూటమి) సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సభకు రెవరెండ్ చిన్న అబ్‌ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి సీనియర్ దైవజనులు టి. నతానియేలు, డాక్టర్. ఎస్. సురేష్, డాక్టర్. ఎల్. మోజెస్, పి. రీవా, చంద్రపోను, సెయింట్ జాన్స్ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ పాతిమారాణి, బి. ప్రభు, వరకుమారి పాల్గొన్నారు. బెంజిమిన్ సేవల్ని స్మరించుకున్నారు. క్రైస్తవ నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై పాలకమండలి సమావేశం



పెదకాకాని: శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినంలో క్యూలైన్లు, వసతులు, స్వామివారి కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం, అన్నప్రసాద వితరణ, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లపై చర్చించి తీర్మానం చేశామన్నారు. 2024 జనవరి నెల ఆలయ జమా ఖర్చులకు ఆమోదం తెలిపినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్స్‌తో బోధన



మాట్లాడుతున్న నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్యాబ్స్ ద్వారా బోధన అందించాలని సమగ్రశిక్ష రాష్ట్ర విభాగ కన్సల్టెంట్ నరసింహారావు తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో పని చేస్తున్న ఐఈఆర్టీలతో పాటు పాఠశాలల్లో పని చేస్తున్న ప్రత్యేక బోధన ఉపాధ్యాయులకు ప్రత్యేకావసరాలు గల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) కు ఉపయోగించే ట్యాబ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాడీపేటలోని సమగ్ర శిక్ష జిల్లా వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నరసింహారావు మాట్లాడుతూ కంటిచూపుతో పాటు, భాషణం, వినికిడి సమస్య గల విద్యార్థులకు ట్యాబ్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేసిందని చెప్పారు. ట్యాబ్స్ ద్వారా బోధన సాగించడం ద్వారా బాలబాలికలకు బోధన సులభతరమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రత్యేక విద్య రాష్ట్ర సహాయ సమన్వయకర్త వనజ, ఎం. శ్రీనివాసరావు, కె-ఆర్‌పీలు పర్వస్వ, సునీల్, బీఎం నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముస్తఫా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం 57వ డివిజన్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అన్ని అభివృద్ధి కార్యక్రమాల 95 శాతం చేశామని తెలిపారు. శివారు కాలనీల్లో సైతం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో విభేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పార్టీ జెండా మోసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో తూర్పు నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేతలు నూర్‌ఖాన్, కర్ణుమ, వాక శ్రీనివాసరెడ్డి, భవాని, ఉష పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై అశ్రద్ధ వద్దు

కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్పందనలో అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు బాధ్యత చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం అందిన అర్జీల పరిష్కారంపై ఆమె సమీక్షించారు. అర్జీలను విభాగాలకు నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నుంచి ఫిర్యాదులు ఉంటే దర్యాప్తు చేసి సిఫార్సు చేయాలని ఆదేశించారు. నగరంలోని 206 వార్డ్ సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని, కార్యదర్శులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఇన్ని ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 40 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 40 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 4 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ శ్రీనివాసరావు, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో బి-సర్టిఫికెట్ పరీక్షలు



హాజరైన అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బి-సర్టిఫికెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు పెద్దసంఖ్యలో అభ్యర్థులు హాజరైనట్లు ఎన్‌సీసీ కల్నల్ ఎస్.ఎం చంద్రశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు, చీరాల, నెల్లూరులో నిర్వహించిన పరీక్షలకు బాయ్స్ విత్ సీనియర్ డివిజన్ (ఎస్‌డీ), గర్ల్స్ విత్ సీనియర్ వింగ్ (ఎస్‌డబ్ల్యూ) విభాగాల వారీగా అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. గుంటూరులో జరిగిన పరీక్షలకు ఎస్‌డీ విభాగంలో 304, ఎస్‌డబ్ల్యూ విభాగంలో 389 మంది చొప్పున హాజరయ్యారు. చీరాలలో ఎస్‌డీ విభాగంలో 416, ఎస్‌డబ్ల్యూ విభాగంలో 195, నెల్లూరులో ఎస్‌డీ విభాగంలో 873, ఎస్‌డబ్ల్యూ విభాగంలో 661 మంది చొప్పున హాజరయ్యారు. క్యాడెట్లలోని కాఠిన్యం, మానసిక దృఢత్వం, మేధో సామర్థ్యాలను పరీక్షించేందుకు బి-సర్టిఫికెట్ పరీక్షలను నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోటీ పరీక్షల్లో బి-సర్టిఫికెట్ హోల్డర్లకు అదనపు మార్కులను ప్రదానం చేస్తుందని తెలిపారు.

లలితా హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రైవేటు లిమిటెడ్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ చైతన్యనేని ప్రమతి మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు ప్రతి ఏటా పెరిగిపోవడం బాధాకరమని తెలిపారు. పురుషుల్లో ఊపిరితిత్తులు, తల, మెడ, కడుపు, ప్రోస్టేట్ క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయని చెప్పారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. వంశపారంపర్యంగా క్యాన్సర్ ఉన్నవారికి ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. శరీరంలో ఎక్కడైనా కణితి ఏర్పడితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా క్యాన్సర్ వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. కారణం లేకుండా ఒక్కసారిగా బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, మలబద్ధకం, తరచుగా విరోచనాలు, మలంలో, మూత్రంలో రక్తం రావడం, దీర్ఘకాలికంగా దగ్గు, గొంతు బొంగురు పోవడం, రొమ్ములో గడ్డలు, మానకుండా దీర్ఘకాలంగా ఉన్న పుండ్లు ఉంటే క్యాన్సర్ లక్షణాలుగా భావించి తక్షణమే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కొత్తపేటలోని స్పెషల్ క్యాన్సర్ క్లినిక్‌లో ఈనెల 29 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా కన్సల్టేషన్, ఈసీజీ, ఈసీ, షుగర్, అల్ట్రాసౌండ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలతోపాటు, పాప్‌స్మియర్ టెస్ట్, ఛాతి ఎక్సరే, బీపీ, వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తామని చెప్పారు.

అదనపు కమిషనర్‌గా రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకారం



కమిషనర్ కీర్తి చేకూరికి మొక్కను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీలో భాగంగా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మిని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం రాజ్యలక్ష్మి నగర కమిషనర్ కీర్తి చేకూరిని కమిషనర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించి విధుల్లో చేరారు. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా విధుల్లో ఉన్న లక్ష్మీశివజ్యోతి, ఓఎస్‌డీ, ఆర్‌డీ, గోపాలపురానికి బదిలీపై వెళ్లారు.

మేయర్‌ను కలిసిన రాజ్యలక్ష్మి

అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి సోమవారం సంపత్ నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ కావటి మనోహర్ నాయుడును కలిసి మొక్కను అందజేశారు.

ఉపనిషత్తుల సారమే త్యాగరాజస్వామి కీర్తనలు



సభలో ప్రసంగిస్తున్న కామేశ్వరశర్మ

పాత గుంటూరు: త్యాగరాజస్వామి 177వ ఆరాధన సంగీత మహోత్సవాలలో భాగంగా గాయత్రీ మహిళా సంగీత సమ్మేళన ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీపురంలోని త్యాగరాజస్వామి కళా వేదికగా నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషరాణి నిర్వహణలో జరిగిన సభలో త్యాగరాజస్వామి, రామభక్తి సామ్రాజ్యం అనే అంశంపై పసుమర్తి కామేశ్వరశర్మ మాట్లాడారు. సంగీత, సాహిత్య సమ్మిళితమైన త్యాగరాజస్వామి అన్నారు. ఉపనిషత్తుల సారమే ఆయన కీర్తనలని తెలిపారు. ఆరాధన ఉత్సవాల ముగింపుగా విజయవాడకు చెందిన పోపూరి గౌరీనాథ్ శాస్త్రీయ సంగీత కచేరి సంగీతాభిమానుల్ని అలరించింది. వయోలిన్‌పై ఆర్. దినకర్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాయిద్య సహకారాన్ని అందించారు. ముఖ్య అతిథులుగా గన్నేపు శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ భానురపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని కళాకారుల్ని సత్కరించారు. సంస్థ అధ్యక్షురాలు కార్యదర్శి ఎ.వి. మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం. రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాదవీకృష్ణ, కోశాధికారి ఎం. విజయలక్ష్మి పర్యవేక్షించారు.

మృతదేహంతో రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ చేబ్రోలు పోలీసుస్టేషన్ ముందు మృతదేహాన్ని పెట్టి రాస్తారోకో చేసిన సంఘటన సోమవారం జరిగింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన వల్లపల్లి విజయ్ ఆదివారం మండల కేంద్రమైన చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడి మరణానికి లారీ, కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో విజయ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం మోదుకూరు తీసుకువెళ్తూ చేబ్రోలు పోలీసుస్టేషన్ ముందు ఉంచి రాస్తారోకో చేశారు. జేబీసీ రూట్ దారిపై యువకుడి మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు బైఠాయించారు. ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, విజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్, పట్టణ సీఐలు కోటేశ్వరరావు, భాస్కరరావు, చేబ్రోలు ఎస్ఐ గిరిబాబు, స్థానిక తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు నిరసన వ్యక్తం చేస్తున్న వారితో సంప్రదింపులు జరిపారు. నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకరించారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకోతో జగదుంతో పాన్నూరు, గుంటూరు వైపున పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చివరకు మృతదేహాన్ని అక్కడ నుంచి తరలించడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నికల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేస్తూ, అందులో ఎదురయ్యే సమస్యల పరిష్కారసత్తాను అధిగమించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు టెక్నిజెన పేరుతో ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో మొదటిరోజు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని లక్ష్యసాధన దిశగా కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలు మెరుగు పరుచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ జి.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ టెక్నికల్ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 1,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని, తొలిరోజు జరిగిన 'సి జావా', 'పైథాన్' విభాగాల్లో విద్యార్థులు ప్రతిభను నిరూపించుకునేందుకు ఉత్సుకత చూపడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏపీ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణసైన్యం ప్రార్థన మందిర వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న సంఘ కాపరులు, నేతలు

పెదకాకాని: నంబూరు రక్షణసైన్య ప్రార్థన మందిరంలో సోమవారం 7వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిని కోసాయనంగా ఆలపించారు. సంఘకాపరులు లెఫ్టినెంట్ జి.మనోహర్, లెఫ్టినెంట్ జి.అనితలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొన్నూరు కానిసక్యూటు కలారి వెంకటలోకయ్య సూచనల మేరకు నాల్గవ వార్డు సభ్యుడు రిష్యగూర కిరణ్‌కుమార్‌రెడ్డి సంఘ పెద్దలకు రూ.50 వేలు అందజేశారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు బాగాదిరి మురళీమోహన్‌రెడ్డి, పెదకాకాని పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోటిరెడ్డి, ఎంపీపీఎం ఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పాల్గొన్నారు.

'బజరంగ్' వైద్య శిబిరానికి స్వాత్మానందేంద్ర సరస్వతి రాక



పెదకాకాని: పొన్నూరు పట్టణంలో ఫిబ్రవరి మూడో వారంలో జరగనున్న బజరంగ్ జనసేవా సంక్షేమ సంఘం వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామి విచ్చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ అధినేత జంపని మురళీకృష్ణ సోమవారం తెలిపారు. విజయవాడలో స్వామిని కలిసి బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య సేవా కార్యక్రమాలను తెలియజేయగా ఆశీర్వదించారని తెలిపారు.